# సంపాదకీయం


శుక్రవారం 11-08-2023

## జనాభా పెరుగుదల సవాళ్లు

ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశం భారత్. మొన్నటి వరకు చైనా పేరిట ఉన్న రికార్డును భారత్ బద్దలు కొట్టింది. చైనాను వెనక్కి నెట్టి మరీ జనాభాలో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. 2030 నాటికి భారత దేశ జనాభా 1.6 బిలియన్లకు చేరుకుంటుందని అంచనా. అంటే 160 కోట్లకు పైగా చేరుకుంటుందని అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయి. 2020 లో 1.3 బిలియన్లుగా ఉన్న జనాభా.. నానాటికీ గణనీయంగా పెరుగుతుందని చెబుతున్నాయి. విపరీతమైన జనాభా పెరుగుదల వల్ల సహజ వనరులపై, మౌలిక సదుపాయాలపై ఒత్తిడి పెరగనుంది. జాతీయ కమిషన్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రచురించిన టెక్నికల్ గ్రూప్ నివేదిక ప్రకారం.. జులై 1, 2023 నాటికి జనాభా అంచనా 139.23 కోట్లు అని లోక్‌సభలో కేంద్ర సర్కారు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చింది. కరోనా కారణంగా 2021 జనాభా లెక్కలు నిర్వహించలేదని చెప్పుకొచ్చారు. అలాగే 2023 నాటికి భారత్ లో ముస్లిం జనాభా 20 కోట్లకు చేరుకున్నట్లు కేంద్రం చెప్పుకొచ్చింది. ఇటీవల, కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి స్మృతి ఇరానీ లోక్‌సభలో మాట్లాడుతూ 2023 నాటికి భారత్ లో ముస్లిం జనాభా 19.7 కోట్లు ఉంటుందని అంచనా అని పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మొత్తం జనాభాలో ముస్లింలు 14.2 శాతం ఉన్నారు. 2023 అంచనా ప్రకారం ముస్లింల జనాభా 19.7 శాతానికి చేరుకున్నట్లు చెప్పారు. జనాభా పెరుగుదల సవాళ్లను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎంతో చేయాల్సి ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జనాభా పెరుగుదలపై ప్రభుత్వాలు ఏం చేయనున్నాయి.. ఏం చేస్తే జనాభాను నియంత్రించవచ్చు.. అనే ఇతర అంశాల గురించి ఇప్పుడు చూద్దాం. భారతదేశ జనాభా పెరుగుదల వనరులు, మౌలిక సదుపాయాలపై ఒత్తిడి తీసుకువస్తుంది. దేశం ఇప్పటికే నీరు, ఆహారం, ఇంధన కొరతను ఎదుర్కొంటోంది. జనాభా పెరిగేకొద్దీ, ఈ కొరత మరింత తీవ్రం అవుతుంది. జనాభా పెరుగుదల పర్యావరణంపైనా ఒత్తిడి తెస్తుంది. ప్రపంచంలో అత్యంత కాలుష్య దేశాల్లో భారత్ ఒకటి. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. అయితే పెరుగుతున్న జనాభా డిమాండ్ లను కొనసాగించడం సవాలుగా ఉంది. జనాభా పెరుగుదల సవాళ్లను పరిష్కరించడానికి జనాభా నియంత్రణే కీలకం. జనాభాను తగ్గించడం ద్వారా, వనరులను పరిరక్షించడానికి, పర్యావరణాన్ని మెరుగుపరచడానికి, భారతదేశానికి మరింత స్థిరమైన భవిష్యత్తును రూపొందించడానికి ప్రభుత్వ చర్యలు కీలకం కానున్నాయి. జనాభా నియంత్రణ వల్ల జీవన నాణ్యత మెరుగుపడుతుంది. కుటుంబంలో తక్కువ మంది ఉంటే.. వారి జీవన నాణ్యత, పిల్లల విద్య, ఆరోగ్య సంరక్షణ, అవసరాలు తీర్చడం, సౌకర్యాలు కల్పించడం వంటివి సులభమవుతాయి. 2030 నాటికి ప్రతి స్త్రీకి 2.2 పిల్లల సంతానోత్పత్తి రేటును 2.1 కి తగ్గించడం ప్రభుత్వ జనాభా విధానాల్లో ముఖ్య లక్ష్యం. కుటుంబ నియంత్రణ విద్య, గర్భనిరోధకం, మహిళల ఆర్థిక సాధికారత వంటి చర్యల వల్ల మాత్రమే ఇది సాధ్యం అవుతుంది. జనాభా జీవన నాణ్యతను మెరుగుపరచడానికి, సంతానోత్పత్తి రేటును తగ్గించడానికి అవసరమైన విద్య, ఆరోగ్య సంరక్షణలో కూడా ప్రభుత్వం కేటాయింపులు జరుపుతోంది. విద్య, ఉపాధికి మెరుగైన అవకాశాలను అందించడం ద్వారా చిన్న కుటుంబాలను ప్రోత్సహించాలని, చిన్న కుటుంబం-చింతలేని కుటుంబం అనేలా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సంతానోత్పత్తి రేటు తగ్గించడానికి, విద్య, ఆరోగ్య సంరక్షణను మెరుగు పరచడానికి, పర్యావరణాన్ని పరిరక్షించడానికి చర్యలు తీసుకోవడం ద్వారా దేశ ప్రజలకు మెరుగైన భవిష్యత్తును ఇవ్వొచ్చు అన్నది శాస్త్రవేత్తలు చెబుతున్న మాట.

## ఓటర్ల ఇంటింటి సర్వే వంద శాతం పూర్తి కావాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 10 విభారె న్యూస్ :-రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024లో భాగంగా ఇంటింటి సర్వే వంద శాతం పూర్తి కావాలని అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. గురువారం అమరావతి విజయవాడ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, ఎక్స్ అఫిషియో కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ ఛాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్, డిఆర్ఓ పుల్లయ్య, ఈఆర్ఓలు, ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా కోసం చేపట్టిన ఇంటింటి సర్వే పురోగతిపై జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఫారం 6 కొత్త ఓటర్లకు, 18 సంవత్సరాల నిండిన వారికి ఇవ్వాలని, ఫారం 8 చిరునామా మార్పులు కొరకు ఇవ్వాలన్నారు. ఓటర్ల తొలగింపు సంబంధించి ప్రొసీజర్ ప్రకారం జాగ్రత్తగా చేయాలన్నారు. అలాగే పలు అంశాలపై అందుకు సంబంధించిన కార్యాచరణపై.... జిల్లాలలోని అన్ని నియోజకవర్గాల ఈఆర్ ఓలు, ఏఈఆర్ ఓలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు షెడ్యూల్ ప్రకారం ప్రణాళికాబద్ధంగా పారదర్శక ఓటర్ల జాబితా ప్రక్రియ పూర్తి చేస్తున్నామని రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024ను ఎలాంటి పెండింగ్ లేకుండా ఇంటింటి సర్వేని వేగవంతం చేసి ఈనెల 21వ తేదీలోగా పూర్తి చేస్తామన్నారు. అలాగే జిల్లాలో ఫారమ్ 6, ఫారమ్-7, ఫారమ్-8 పెండిన్సి ల పై, గ్రీవెన్స్ ల పరిష్కారాల గురించి వివరించారు. కొత్తగా ఓటు నమోదుకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 18-19 వయస్సులో ఉన్న వారు, ట్రాన్స్ జెండర్లు, నిరాశ్రయుల జాబితా తయారీలోను ప్రత్యేక దృష్టి సారించాలని సంబందిత అధికారులకు సూచించారు.

## 12 న అహోబిలంలో సాంస్కృతిక వారసత్వ యాత్ర

ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 10 విభారె న్యూస్ :- యువతరంలో మన సంస్కృతి సంప్రదాయాల పై అవగాహన కలిగించడం కోసం ఈనెల 12న శనివారం సాంస్కృతిక వారసత్వ యాత్ర అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమ్యూనికేషన్ అధికారి కె సేతురామన్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహోబిల క్షేత్ర ప్రాచీన ప్రాశస్త్యాన్ని, సాంస్కృతిక వైభవాన్ని తెలియజెప్పే ఉద్దేశ్యం తో,శ్రీ అహోబిల మఠం 46వ పీఠాధిపతి వారి ఆజ్ఞ మేరకు అహోబిలం టిటిడి కళ్యాణ మండపంలో ఇంటాక్ , నంద్యాల చాప్టర్ తో కలిసి,లబ్ధ ప్రతిష్టులైన అతిథుల సమక్షంలో పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక వారసత్వ యాత్ర నిర్వహించబడుచున్నదన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ప్రజ్ఞ విద్యా సంస్థలు, రవీంద్ర విద్య సంస్థలు, నంద్యాలకు చెందిన బాల అకాడెమి విద్యార్థులు పాల్గొంటారన్నారు.

## ఉమ్రా వెళ్లే ముస్లిం సోదరులకు అవగాహన తరగతులు ఉమ్రా వెళ్లే ముస్లిం సోదర సోదరీమణులు



ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 10 విభారె న్యూస్ :- ఈనెల 14న సోమవారం ఉమ్రా వెళ్లే ముస్లిం సోదర సోదరీమణులకు చింతకుంట్ల లో గురువారం అవగాహన తరగతులు ఏర్పాటు చేశారు. ఆళ్లగడ్డ పట్టణంలోని కొత్త మస్జీద్ ఇమామ్ నయిముల్లాహ్ అల్ - ఫయాజ్ ఉమ్రా టూర్స్, ట్రావెల్స్ ఆధ్వర్యంలో 68 మంది ముస్లిం సోదర సోదరీమణులు 15 రోజులు మక్కామదీన సందర్శనార్థం 14న బయలుదేరి వెళ్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ ప్రతి ముస్లిం జీవితంలో ఒకసారైనా మక్కా మదీనాను సందర్శించాలని కోరుకుంటారన్నారు. అలాంటి కలను మా ప్రాంత ముస్లిం సోదరులకు అల్ ఫయాజ్ టూర్స్ ద్వారా సాకారం చేసిన యాజమాన్యానికి ధన్య వాదాలు తెలియజేస్తున్నానన్నారు. అనంతరం వైకాపా నాయకులు చింతకుంట్ల నాగిరెడ్డి మాట్లాడుతూ మానవాళి కోసం ఉమ్రా వెళ్ళు సభ్యులు అందరూ మక్కామదీన నందు అల్లాహ్ తో దువా చేయాలని కోరారు. అనంతరం టూర్, ట్రావెల్స్ వారు అందించిన కిట్స్ సభ్యులకు అందించి వారిని పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హాఫీజ్ కమల్, హాఫిజ్ సద్దాం,బాష,బ్యాంక్ హుస్సేన్ సా, జమాల్, అమీర్, ఎక్సైడ్ జాకీర్, అన్వర్ పెద్ద సంఖ్యలో ముస్లిం పెద్దలు, సోదరులు పాల్గొన్నారు.

## వార్డు మెంబర్ కు సీపీఎం అభ్యర్థిగా రాణెమ్మ నామినేషన్



పెద్దకడబూరు ఆగష్టు10:౧ ( విభారె న్యూస్) పెద్దకడబూరు మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో 11వ వార్డు మెంబర్ కు సీపీఎం బలపరుస్తున్న రాణెమ్మ గురువారం సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న ఆధ్వర్యంలో నామినేషన్ దాఖలు చేశారు. ఇందుకు సంబంధించిన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి వరప్రసాద్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుండెపోటుతో వాలింటర్ భీమయ్య మృతినివాళులు అర్పించిన ఎమ్మెల్యే శ్రీ వై బాలనాగిరెడ్డి.



కోసిగి, ఆగస్టు10 (విభారె న్యూస్) కోసిగి మండలం కందుకూరు గ్రామ సచివాలయం పరిధిలో కామనదొడ్డి గ్రామ పంచాయతీ నందు తలారి.బీమయ్య (28) అను వాలింటర్ గురువారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో మెరుగైన చికిత్స కోసం తరలిస్తుండగా మార్గ మధ్యం లోని హాల్వి ప్రైవేటు ఆసుపత్రి లో మరణించారు. ఈవిషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీ వై బాలనాగిరెడ్డి గారు గురువారం ఉదయం కామనదొడ్డి గ్రామానికి వెళ్ళి,వాలింటర్ భీమయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి గారితో పాటు కోసిగి,మంత్రాలయం మండల కన్వీనర్లు బెట్టనగౌడ్,బీమారెడ్డి నరసింహులు గౌడ్,గోవిందు గౌడ్,తాయన్న,బషీర్,రామన్న,తోటి వాలింటర్లు తదితరులు నివాళులర్పించారు.

## శ్రీశైలం జలాశయం నుంచి తక్షణమే నీటిని విడుదల చేయాలి.

### సిపిఐ జిల్లా నాయకుల డిమాండ్




నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 10 విభారె న్యూస్ :-రాయలసీమ సాగునీటి తాగునీటికై శ్రీశైలం రిజర్వాయర్ ద్వారా కె.సి.కెనాల్, ఎస్ ఆర్ బీసి , తెలుగుగంగ, హంద్రీ-నీవా అయకట్టుకు తక్షణమే నీటిని విడుదల చేసి రాయలసీమ రైతాంగాని ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే రామాంజనేయులు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి. ఎస్. బాబా పకృద్దీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. గురువారం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే. రామాంజనేయులు. బాబా ఫకృద్దీన్ ఓ ప్రకటనలో మాట్లాడుతూరాయలసీమ ప్రయోజనాలు కాపాడుతామని రైతు శ్రేయస్సు ముఖ్యమని చెబుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఖరీఫ్ సీజను వచ్చిన రైతులు సాగునీటి కోసం ఆయకట్టు రైతులు ఎదురుచూస్తూన్నా కేసీ కెనాల్ తెలుగంగ ఎస్ఆర్బిసి కి నీటిని విడుదల చేయకపోవడంవిచారకరమని అన్నారు. నంద్యాల లో జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు ప్రజా ప్రతినిధులు పాల్గొని శ్రీశైలం రిజర్వాయర్ ద్వారా నీటి విడుదల తేదీని ప్రకటించకుండా రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా తూతూ మంత్రంలా సమావేశం జరిపి ముగించడం దుర్మార్గమని విమర్శించారు. శ్రీశైలం రిజర్వాయర్ లో 854 నీటిమట్టం చేరిన తర్వాత పోతిరెడ్డిపాడు హెడ్ ఎగ్యులేటర్ కు నీటిని వదలాల్సి ఉందని ప్రస్తుతమ్ శ్రీశైలం రిజర్వాయర్లో 863 అడుగుల నీరు చేరినప్పటికీ నీరు విడుదల చేయకుండా విద్యుత్ ఉత్పత్తి కోసం నీరును ఆపడం తగదని త్రాగునీటికి, తరువాత సాగునీటికి ప్రాధాన్యతను ఇవ్వాలని చట్టంలో ఉందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం శ్రీశైలం రిజర్వాయర్ ద్వారా కేసీ కెనాల్. ఎస్ఆర్బిసి తెలుగు గంగ. హంద్రీనీవా ఆయకట్టు కాలువలకు వెంటనే నీటిని విడుదల చేసి రాయలసీమ రైతాంగాన్ని ఆదుకోవాలని పై నాయకులు డిమాండ్ చేశారు.

## పంచాయతీ నిధుల పై నిరసన: బిజెపి. జనసేన



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 10 విభారే న్యూస్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర రథసారథి శ్రీమతిపురందేశ్వరి పిలుపు మేరకు నంద్యాల పట్టణంలో గురువారం సర్పంచుల సమస్యల గురించి భారతీయ జనతా పార్టీ జనసేన పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద . నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాలను అభివృద్ధి చేసే సర్పంచుల నిధులే దారి మళ్లించే దౌర్భాగ్యమైన పరిపాలన ఉందని అన్నారు. జగన్ పరిపాలన ఇంత ఘోరంగా ఉంటుందని అనుకోలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలు అభివృద్ధి చెందాలని నిధులు మంజూరు చేస్తే ఆ నిధులను పక్కదారి పట్టించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో భారిగా బిజెపి నాయకులు జనసేన నాయకులు పాల్గొన్నారు.

## రాజగోపురం నిర్మాణం కొరకు విరాళం అందజేసిన కర్నూలు వాస్తవ్యులు.



కౌతాళం ఆగష్టు 10 విభారె న్యూస్.శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థాన రాజగోపుర నిర్మాణం కొరకు కర్నూలు వాస్తవ్యులు తాండ్రపాడు వెంకట నరసయ్య శెట్టి పేరుపై వారి కుటుంబ సభ్యులు తాండ్రపాడు ఉరుకుందయ్య శెట్టి వారు ?.1,11,116/- విరాళంగా చెల్లించియున్నారు.దాతలకు దేవస్థాన ఆలయ అధికారులు శ్రీ స్వామి దర్శనం,స్వామివారి శేష వస్త్రాము,లడ్డూ ప్రసాదాలు,ఆశీర్వాదాలు కల్పించి,బాండు పేపర్, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో సీనియర్ అసిస్టెంట్ రామలింగారెడ్డి, దేవస్థాన సిబ్బంది చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం

### ఇరవై వేల చెక్కును అందించిన..అడిషనల్ ఎస్పీ జి .వెంకట రాముడు



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 10 విభారె న్యూస్ :-నంద్యాల జిల్లా యూనిట్ లో పనిచేస్తున్న విదినిర్వహణలో మరణించిన కె .రాజశేఖర్ కుటుంబానికి ఆర్థిక సహాయంగా ఫ్యామిలి ఇన్సూరెన్స్ కింద ఇరవై వేల చెక్కును నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ జి .వెంకట రాముడు రాజశేఖర్ భార్య కె.వెంకట లక్షమమ్మకు గురువారం నాడు అందజేశారు. ఈ కార్యాక్రమంలో అడిషనల్ ఎస్పీ గారితో పాటు ఆర్ ఐ సుధాకర్ ,హోంగార్డ్ ఇంచార్జ తిరుపాల్ పాల్గొన్నారు.

# పార్టీని ఇబ్బందుల్లో పడేస్తున్న లావు

గుంటూరు, ఆగస్టు 10, ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల హాట్ టాపిక్‌గా మారిన అంశం డేటా చోరీ. ఏపీ ప్రభుత్వం వాలంటీర్ల ద్వారా ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి ప్రైవేటు సంస్థలకు చేరు వేస్తోందన్న ఆరోపణలు వచ్చాయి. అయితే ఆ ఆరోపణలన్నింటినీ ప్రభుత్వం ఖండించింది. ఇప్పుడిదే అంశంపై పార్లమెంట్‌లో భిన్నంగామాట్లాడారు ఎంపీ లావు కృష్ణదేవరాయులు. వ్యక్తిగత డేటా రక్షణ బిల్లుపై పార్లమెంట్ లో చర్చ జరిగింది. ఈ సందర్భంగా వైసీపీ ఎంపీ లావు కు మాట్లాడే అవకాశం వచ్చింది. ప్రభుత్వం సేకరిస్తున్న వ్యక్తిగత వివరాలు పథకాల అమలు కోసం వినియోగించుకోవచ్చని బిల్లులో ఉందని.. కానీ ప్రభుత్వాలు వాటిని దుర్వినియోగం చేసి ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఉపయోగించుకుంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా దుర్వినియోగం చేయకుండా అడ్డుకట్ట వేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం.. డేటా చదుర్వినియోగం అనే మాట వినిపిస్తే.. అందరూ చూసేది వైసీపీ ప్రభుత్వం వైపే. వాలంటీర్ల తో సమాచారం సేకరించి.. ప్రభుత్వం ఆ సమాచారాన్ని దుర్వినియోగం చేస్తోందన్న ఆరోపణలు విస్తృతంగా వస్తున్నాయి. ఓ ప్రైవేటు కంపెనీకి సమాచారాన్ని షేర్ చేస్తున్నారని.. వారి ద్వారా ఓటర్లను 360 డిగ్రీల ప్రోఫైలింగ్ తయారు చేసి ఓటర్లను ప్రభావితం చేసే కుట్ర చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ఎంపీ లావు... నేరుగా పార్లమెంట్‌లోనే మాట్లాడారు. ఆ విషయంపై స్పష్టత ఉన్నా... లావు కృష్ణదేవరాయులు ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. ఎక్కడా ఏపీ ప్రభుత్వం అని ఆయన చెప్పలేదు కానీ.. సులువుగానే అర్థమైపోతుంది. వాలంటీర్ల వివాదం ఉన్నప్పుడు లావు అలా ఎలా మాట్లాడారని వైసీపీ వర్గాలు కూడా ఆశ్చర్యపోతున్నాయి. ఇప్పటికే ఆయన వైసీపీ అధినేత తీరుతో అసంతృప్తి చెంది పార్టీకి దూరంగా ఉంటున్నారని చెబుతున్నారు. ఎంపీ లావు టీడీపీ తీర్థం పుచ్చుకోబోతున్నారని.. టీడీపీ అధినేత చంద్రబాబుతో రహస్యంగా భేటీ అయ్యారని చాలా రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఆయన వీటిని ఖండించారు. నరసారావుపేట పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలతో కూడా లావు కృష్ణదేవరాయులుకు సరిపడటం లేదు. ముఖ్యంగా మంత్రి విడదల రజనీకి... కృష్ణదేవరాయులకు వివాదాలున్నాయి. చిలుకలూరిపేట నియోజకవర్గంలో ఆయనను పర్యటించేందుకు కూడా విడదల రజనీ అంగీకరించడం లేదు. ప్రోటోకాల్ ప్రకారం కూడా లావు కృష్ణదేవరాయులుకు పార్టీలో ప్రాధాన్యం లభించడం లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఆయనతో పాటు ఆయన అనుచరులనూ పార్టీలో దూరం పెడుతున్నారన్న అసంతృప్తితో ఉన్నారని చెబుతున్నారు. ఈ కారణంగా వైసీపతో అంటీ ముట్టనట్లుగా ఉంటున్న ఆయన.. ఇప్పుడు డేటా విషయంలో ప్రభుత్వాలే దుర్వినియోగం చేస్తున్నట్లుగా వ్యాఖ్యానించడం కలకలం రేపుతోంది. గతంలో తెలుగు విషయంలో ఏపీ సర్కార్ తీసుకున్న నిర్ణయంపై పరోక్షంగా రఘురామకృష్ణరాజు పార్లమెంట్‌లోనే వ్యతిరేకంగా మాట్లాడారు.

# కడప, తిరుపతి ఫోర్ లైన్ పనులు ప్రారంభం

తిరుపతి, ఆగస్టు 10, కడప తిరుపతి ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న కడప- తిరుపతి గ్రీన్ ఫీల్డ్ హైవేకి సంబంధించిన పనులు ప్రారంభం అయ్యాయి. రాజంపేట వద్ద ఈ హైవేకి సంబంధించిన పనులకు తొలి అడుగు పడింది. కడప నుంచి తిరుపతికి 4 లైన్ల రహదారి 2,200 కోట్లతో నిర్మాణం కానుంది. దీనికి సంబంధించిన క్లీన్ అండ్ గ్రబ్బింగ్ పనులను గ్రీన్ ఫీల్డ్ హైవే లైజనింగ్ ఆఫీసర్ హర్ష అభిరామ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ పనులు పూర్తి అవ్వడానికి రెండు నెలల సమయం పడుతుంది. ఈ ప్రాజెక్టు పనులు మొత్తంగా రెండు ప్యాకేజీల కింద జరగనున్నాయి. మొదటి ప్యాకేజీ కడప నుంచి చిన్న ఓరంపాడు వరకు 64 కిలో మీటర్లు , రెండవ ప్యాకేజీ కింద రేణిగుంట 59 కిలో మీటర్ల వరకు జరగనుంది. ఈ హైవే నిర్మాణంలో కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. కడప నుంచి రేణిగుంట మధ్యలో 52 లైట్ వెహికల్ అండర్ పాస్ బ్రిడ్జిలు, 8 వెహికల్ అండర్ పాస్ లు, 72 మేజర్, మైనర్ బ్రిడ్జిలు, 240 కల్వర్టులు, 3 రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి లను నిర్మించనున్నారు. ఈ హైవే పూర్తి అయితే కనుక కడప నుంచి తిరుపతి మధ్య దూరం తగ్గనుంది. ఎక్కువ మలుపులు లేకుండా రోడ్డు మార్గం తయారవుతుంది. ప్రస్తుతం ఉన్న మలుపుల రోడ్డు వలన ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతో మంది చనిపోయారు. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే ప్రజల బాధలు కొంచెం తీరినట్లేనని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ హైవే పూర్తి అయితే అటు బెంగళూరు నుంచి కానీ, ఇటు హైదరాబాద్ నుంచి కానీ తిరుపతి వచ్చే వారికి మార్గం సుగమం అవుతుంది.

# బెజవాడలో సిమ్ స్కామ్

విజయవాడ, ఆగస్టు 10, ఒక్క ఫోటోపై ఏకంగా 658 సిమ్ కార్డులు జారీ అయ్యాయి. . బెజవాడ లోని గుణదలతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఆ సిమ్ కార్డులతో అసలేం చేస్తున్నారో కనిపెట్టేందుకు అధికారులు రంగంలోకి దిగారు. డిపార్ట్మెంట్ ఆఫ్ టెలికమ్యునికేషన్స్ ఫిర్యాదు మేరకు పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా స్వయంగా విచారణ చేపట్టారు. సూర్యారావుపేట పోలీసుల ఆధ్వర్యంలో దర్యాప్తు జరుగుతోంది. పోలీసుల దర్యాప్తు లో ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఇందులో ఎవరెవరు ఉన్నారు, ఎందుకు అన్ని సిమ్ కార్డులు జారీ చేశారు, అందులో కారణాలు, ఎంటి అనే విషయాలతో పాటుగా కుట్ర కోణంలో కూడ దర్యాప్తు చేపట్టారు. సిమ్ కార్డు జారి అయిన వ్యక్తి ఫోటో ఆదారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆదార్ , పాన్ లింక్ లను సేకరించి సాంకేతిక ఆధారాలను గురించి వాకబు చేస్తున్నారు. ఒకే ఫొటోతో ఒకటే నెట్ వర్క్ సంస్థకు చెందిన 658 సిమ్ లను అమ్మినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడయ్యింది. సత్యనారాయణపురానికి చెందిన పోలుకొండ నవీన్ అనే యువకుడు వీటిని రిజిస్టర్ చేసినట్లు గుర్తించారు. ఇదే తరహాలో అజిత్ సింగ్ నగర్, విస్సన్నపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో మరో 150 వరకు సిమ్ కార్డులు నకిలీ పత్రాలతో జారీ అయినట్లు గుర్తించారు. ఈ సమాచారాన్ని ఎన్టీఆర్ జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లు పంపి, వాటికి సంబంధించిన ఆధారాలు ఇంకా ఎమయినా ఉన్నాయా అనే విషయాలు సేకరిచటంతో పాటుగా, నెట్ వర్క్ సంస్దలకు పోలీసులు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు ఆయా నెట్ వర్క్ సంస్దల యాజమాన్యాలను అలర్ట్ చేయటంతో పాటుగా తగిన సమాచారాన్ని అందించేందుకు మెయిల్స్ ద్వారా సంప్రదింపులు చేస్తున్నారు. సిమ్ కార్డుల మోసాలను అరికట్టేందుకు టెలికమ్యునికేషన్ల శాఖ కృత్రిమ మేధస్సుతో పని చేసే టూల్ కిట్ ను వినియోగించింది. ఈ విధానం ద్వారా సిమ్ కార్డులను పూర్తి స్దాయిలో పరిశీలించవచ్చు. అంతే కాదు ఆయా నెట్ వర్క్ ల కు చెందిన సిమ్ కార్డులను వడపోయటంతో అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని చెబుతున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ ఫేసియల్ రికగ్నేషన్ పవర్డ్ సొల్యూషన్ ఫర్ టెలికాం సిమ్ సబైబర్ వెరిఫికేషన్, సాఫ్ట్వేర్ ద్వారా సిమ్ కార్డు మోసాలను గుర్తించి, సంబంధిత నంబర్లను బ్లాక్ చేయటంలో అధికార యంత్రాంగం ముందుంది. అన్ని టెలికాం ఆపరేటర్ల నుంచి సిమ్ కార్డుదారులకు చెందని ఫోటోలు, ఇతర ఆధారాలను సేకరించి వాటిని క్షుణ్ణంగా పరిశీలించటం ద్వారా సంఘ వ్యతిరేక శక్తుల చేతుల్లోకి విలువయిన డేటాను వెళ్ళకుండా జాగ్రత్తలను పాటిస్తున్నారు. ఇలాంటి చర్యల్లో భాగంగా నిర్వహించిన తనఖీల్లో ఒకే ఫొటోతో పెద్ద ఎత్తున సిమ్ లు తీసుకున్న విషయం బయటకు వచ్చింది. నకిలీ పత్రాలతో జారీ అయిన సిమ్ కార్డులు అసాంఘిక శక్తుల చేతుల్లో పడితే దేశ భద్రతకు సైతం ముప్పు వాటిల్లే పరిస్దితులు ఉన్నాయి, ఇటీవల కాలంలో హనీ ట్రాప్ లు కూడ వెలుగులోకి రావటంతో సాంకేతికంగా వస్తున్న మార్పులను కూడ ప్రభుత్వ రంగ సంస్దలు పరిశీలిన జరుపుతున్నాయి. ఈ సిమ్ లు ఎక్కడికి వెళ్లాయి, ఎవరు వినియోగిస్తున్నారు అనే అంశాలు పై కూడ దర్యాప్తు చేస్తున్నారు. అందులో భాగంగానే ఆయా సిమ్ కార్డుల కాల్ లిస్ట్ లను కూడ సేకరించటం ద్వార దర్యప్తు వేగవంతం అవుతుందని విచారణ అధికారులు భావిస్తున్నారు.

# ఆప్కో బట్టలకు ఫుల్ డిమాండ్

విజయవాడ, ఆగస్టు 10, ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ఉద్యోగులు దుస్తులు కొనేందుకు తెగ ఎగబడ్డారు. సచివాలయం మూడో బ్లాక్ లో ఉన్న ఆప్కో ఔట్ లెట్ లో చేనేత వస్త్రాలు కొనడానికి బారులు తీరారు. ఎప్పుడూ ఖాళీగా దర్శనమిచ్చే ఆ స్టాల్ కు ఉద్యోగులు బారులు తీరారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు భారీగా రావడంతో స్టాల్ మొత్తం నిండిపోయింది. సెక్రటేరియట్ లో తమ బాధ్యతల్లో బిజీగా ఉండే ఉద్యోగులు ఎప్పుడూ లేనివిధంగా ఆ స్టాల్ ను ప్రతి రోజూ సగానికిపైగా ఖాళీ చేస్తున్నారు. ఇక్కడ పెట్టిన ఆఫర్ మళ్లీ మళ్లీ రాదనుకున్నారో ఏమో గానీ పండగ సీజన్ కంటే ఎక్కువగా బట్టలు కొనేస్తున్నారు. దీంతో ప్రతి రోజూ కొత్త సరుకును ఆర్డర్ పెట్టి తీసుకొస్తున్నట్లు స్టాల్ నిర్వాహకులు చెప్పారు. స్టాల్ లో ఎప్పుడు చూసినా మహిళా ఉద్యోగులతో నిండిపోతూ ఉండటంతో ఎప్పుడు రావాలనే దానిపై ఫిక్స్‌ టైం కూడా బోర్డులు పెట్టేసారు స్టాల్ నిర్వాహకులు. అసలింతకీ అక్కడ ఉద్యోగులు ఎగబడటానికి కారణం ఏంటి?అమరావతి సచివాలయం మూడో బ్లాక్ లో ఆప్కో చేనేత దుస్తుల స్టాల్ ను ఏర్పాటు చేశారు అయితే గతంలో ఎప్పుడూ ఇక్కడ పెద్దగా అమ్మకాలు లేవు. అయితే ఆగస్ట్ 7 వ తేదీన జరిగిన చేనేత దినోత్సవం రోజు బంపర్ ఆఫర్లను ప్రకటించారు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సునీత. సెక్రటేరియట్ కో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చేనేత దుస్తులను ధరించడం ద్వారా నేతన్నలను ఆదుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం చేనేత దుస్తులు ధరించాలని పిలుపునిచ్చారు మామూలుగా పిలుపునిస్తే ఎవరూ పెద్దగా స్పందించరు అనుకున్నారేమో ఆఫర్లను ప్రకటించేశారు సెక్రటేరియట్ ఉద్యోగులకు 50 శాతం రాయితీతో ఆప్కో స్టాల్ లో వస్త్రాలు కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించారు. స్టాల్ లో లభించే నేత చీరలు, మగవారికి కావాల్సిన ప్యాంటు షార్టులపై ఈ ఆఫర్ వర్తిస్తుందని ప్రకటించారు. ఆగస్ట్ 31 వరకూ ఈ ఆఫర్ ఉంటుందని ప్రకటించారు. దీంతో ఆప్కో స్టాల్ కు ఉద్యోగులు ఎగబడుతున్నారు. భోజనం విరమంలో కూడా ఉద్యోగుల తాకిడి ఎక్కువగా ఉండటంతో ఫలానా టైం లో మాత్రమే డిస్కౌంట్ వర్తిస్తుందని బోర్డులు కూడా పెట్టారు. గతంలో రోజుకు సగటున 20 వేలు ఉండే కౌంటర్ ఒక్కసారిగా లక్షా 50 వేలకు పెరిగిందని ఆప్కో నిర్వాహకులు చెబుతున్నారు. బయట మార్కెట్ లో కంటే సగం రేటుకు వస్తుండటంతో పండగలకు ముందస్తు కొనుగోళ్లు చేస్తున్నామని ఉద్యోగులు చెబుతున్నారు. మరోవైపు ఉద్యోగులు ఒకేసారి బిల్లు చెల్లించే అవసరం లేకుండా రెండు మూడు వాయిదాల్లో చెల్లించేలా కూడా ఆఫర్ పెట్టారు.

# పొలాలకు బీటలు వారడంతో కన్నీరు

కాకినాడ, ఆగస్టు 10, పెద్ద ఎత్తున వర్షాలు పడినా, ప్రాజెక్టులన్నీ నిండుకుండల్లా మారినా.. ఆ ప్రాంతంలో మాత్రం పంట పొలాలకు సాగు నీరు అందడం లేదు. కారణంగా పంట భూములన్నీ బీటలు వారాయి. అది చూసిన రైతులకు ఏం చేయాలో తెలియక కన్నీరు పెడుతున్నారు. వ్యవసాయాన్నే నమ్ముకుని జీవిస్తున్న తాము ఏం చేయాలా అంటూ తలలు పట్టుకుంటున్నారు. పంట పొలాల వద్దకు వెళ్లి నెర్రలు వారిని భూమిలో కూర్చొని తల్లడిల్లిపోతున్నారు. బతకడం కంటే చావడమే నయం అని అంటున్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం మల్లవరంలో సుమారు 1300 ఎకరాల విస్తీర్ణంలో గల ఆడ్ ఆర్ బీ చెరువు ద్వారా గొల్లప్రోలు, తొండంగి, కొత్తపల్లి మండాల పరిధిలో పది గ్రామాల్లో ఉన్న సుమారు 20 వేల ఎకరాలు ఆయకట్టుకు సాగు నీరు అందుతుంది. ఈ చెరువుపై ఆధారపడే అక్కడి ప్రజలు పంటలు సాగు చేస్తుంటారు. సాధారణంగా జూన్, జులై నెలలలో కురిసే వర్షాలతో పాటు పీబీసీ ద్వారా వచ్చే గోదావరి నీటితో చెరువులోకి సాగునీరు అందుతుంది. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా కురవడం, రెండు వారాల క్రితం కురిసిన భారీ వర్షాలతో ఏకే, ఏపీ మల్లవరం గ్రామాల్లోని రైతులు తమ పొలాలను దమ్ము చేసుకుని వెదజల్లు పద్ధతిలో వరిసాగును చేపట్టారు. రెండు వారాల వరకూ వర్షం ద్వారా లభించిన తడి సరిపోయింది. అయితే గత ఐదు రోజులుగా ఎండలు మండిపోతుండడంతో.. ఆర్ ఆర్ బీ చెరువులో 13 తూములు ద్వారా నీరు సరఫరా కాకపోవడంతో పంట ఎండిపోవడం ప్రారంభం అయింది. కొన్ని చోట్ల వరి పొలాలు బీటలు వారాయి. రెండు గ్రామాల్లో సుమారు 1400 ఎకరాలకు ప్రస్తుతం సాగునీరు అందని పరిస్థితి ఏర్పడిందని రైతులు తెలిపారు. ఎకరాకు రూ.15 వేల వరకూ పెట్టుబడులు పెట్టామని... ఇప్పుడు ఏం చేయాలో పాలుపోవట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయం మీద ఆధారపడే తమ జీవనం సాగుతుందని.. కానీ ఐదు రోజుల ఎండకే పంట భూములు నెరల వారాయని వాపోతున్నారు. ఇరిగేషన్ అధికారులు సాగునీరుకు ఇబ్బంది ఉండదని చెప్పడంతో వర్షపు నీటిపై ఆధారపడి వెదజల్లు పద్ధతిలో వరి వేశామని... కానీ అధికారులు ఇప్పుడు తమ కష్టాలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిఠాపురం బ్రాంచి కెనాల్ నుంచి గోదావరి నీరు రావడం లేదని. ఏలేరు నీరు మళ్లించకపోవడంతో ఆర్‌ఆర్బీ చెరువుకు నీరు వచ్చే మార్గాలు కనిపించడం లేదని చెబుతున్నారు. పంట పొలాలు ఎండిపోవడమే కాకుండా పశువులకు తాగునీరు లభించని పరిస్థితి ఉందని అంటున్నారు. పొలాలకు సాగునీరు అందకుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యం అని స్పష్టం చేశారు. అసలు ఇరిగేషన్ అదికారులు ఎక్కడ ఉన్నారో కూడా తమకు తెలియడం లేదని.. బీటలు వారిని పొలాలు చూసైనా సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని, జిల్లా కలెక్టర్ ను కోరుతున్నారు. ఈ ఏడాది వర్షాలు అంతగా లేకపోవడంతో చెరువులోకి నీరుచేరలేదు. ఇటీవల భారీ వర్షాలతో ఏకే మల్లవరం సహా చుట్టుపక్కల గ్రామాల్లో రైతులు తమ పొలాలను దమ్ము చేసుకుని వరి సాగుచేశారు. అయితే రెండు వారాలుగా వర్షాలు లేకపోవడంతో వరి మడులు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. చెరువులో 13 తూములకు సరైన మరమ్మతులు లేకపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో పంటలు ఎండిపోవడం ప్రారంభం అయింది. కొన్ని చోట్ల వరి పొలాలు బీటలు వారుతున్నాయి. ఏకే, ఏపీ మల్లవరం గ్రామాల్లో సుమారు 1400 ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడిందని రైతులు తెలిపారు సాగునీరుకు ఇబ్బంది ఉండదని చెప్పడంతో వెదజల్లు పద్ధతిలో వరి వేశామని, కానీ ఇప్పుడు అధికారులు నీరు వదలడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిఠాపురం బ్రాంచి కెనాల్ నుంచి గోదావరి నీరు రావడం లేదంటున్నారు. ఏలేరు నీరు మళ్లించకపోవడంతో ఆర్‌ఆర్ బీ చెరువుకు నీరు అందే మార్గాలు లేవని అంటున్నారు. పంట పొలాలు ఎండిపోవడమే కాకుండా పశువులకు తాగునీరు కూడా లభించనిపరిస్థితి ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# పెరిగిన రొయ్యల ధరలు

ఏలూరు, ఆగస్టు 10, ప్రభుత్వ కృషి ఫలితంగా రొయ్యల కౌంట్ ధరలు పెంచేందుకు ప్రాసెసింగ్ కంపెనీలు ముందుకొచ్చాయి. గత నెలాఖరులో జరిగిన ఆక్వా సాధికారత కమిటీ భేటీలో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రకటించిన ధరలను మరోసారి పెంచేందుకు కంపెనీలు అంగీకరించాయి. 20 నుంచి 55 కౌంట్ వరకు కేజీకి రూ.10 చొప్పున, 56 నుంచి 100 కౌంట్ వరకు కేజీకి రూ.5 చొప్పున ధర పెంచుతున్నట్టు ప్రకటించాయి. దేశంలోని మరే రాష్ట్రంలో లేనివిధంగా.. తమ పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధిపై ఆక్వా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆక్వా రైతులు ఏ దశలోనూ నష్టపోకూడదన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రుల సారథ్యంలో సమావేశమైన రైతు సాధికారత కమిటీ రొయ్యల ధరలను పెంచేందుకు కృషి చేస్తోంది. ఆక్వా రైతుల సమక్షంలో ప్రాసెసింగ్ కంపెనీలు, ఎగుమతిదారులతో ప్రభుత్వం ఎప్పటికప్పుడు జరుపుతున్న చర్చలు



మంచి ఫలితమిస్తున్నాయి. గత నెలాఖరులో ప్రకటించిన ధరలు ఈ నెల 8వ తేదీ వరకు కొనసాగగా, మంగళవారం మరోసారి పునఃసమీక్షించి.. కేజీకి రూ.5 నుంచి రూ.10 చొప్పున పెంచేందుకు కంపెనీలు అంగీకరించాయి. ఈ నెల 9వ తేదీ నుంచి రానున్న పది రోజుల పాటు కొత్త ధరలు అమలులో ఉంటాయిప్రభుత్వం నిర్దేశించిన ధరల చెల్లింపులో ఏజెంట్లు, షెడ్ల నిర్వాహకులు కోత పెడుతున్నట్టుగా ప్రభుత్వం దృష్టికి రావడంతో ఎగుమతిదారులతో పాటు షెడ్ల యజమానులు, ఏజెంట్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇకనుండి రైతుల నుంచి కొనుగోలు చేసే వారెవరైనా కచ్చితమైన బిల్లులు ఇచ్చి కొనుగోలు చేసి తీరాల్సిందేనని స్పష్టం చేసింది. లేకుంటే అప్పడా చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని, అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించింది. దేశంలో ఒక్క ఏపీలో మాత్రమే కౌంట్‌ల వారీగా ధరలను ప్రకటిస్తున్నారు. మిగిలిన రాష్ట్రాల్లో పూర్వం నుంచి కొనసాగుతున్నట్టుగా ప్రతి 10 కౌంట్లకు ఒక ధర చొప్పున నిర్ణయిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రకటించిన కౌంట్ ధరలు పొరుగు రాష్ట్రాలతో కంటే మెరుగ్గా ఉన్నాయి. తమిళనాడు, ఒడిశా, గుజరాత్, పశి?చమ బెంగాల్, మహరాష్ట్రలో ప్రధాన కౌంట్లకు మన కంటే కేజీకి రూ.5 నుంచి రూ.25 వరకు తక్కువగానే చెల్లిస్తున్నారు.

# వారసులొస్తున్నారు...

కాకినాడ, ఆగస్టు 10, వారసత్వ రాజకీయాలు మనకేం కొత్త కాదు. దాన్నేదో తప్పుగా చూసే జమానా అసలే కాదు. ఇంకా చెప్పాలంటే? వారసుల్ని రాజకీయాల్లోకి తీసుకురాని నేతల్నే తేడాగా చూసే రోజులివి. ఈ క్రమంలోనే ఉమ్మడి కృష్ణా జిల్లాలో కొడుకుల్ని ఎమ్మెల్యేలుగా చేసి వాళ్ళు అసెంబ్లీలో అధ్యక్షా?. అంటే చెవులారా విని తృప్తి పడాలనుకుంటున్న నాయకులు కొందరైతే? చనిపోయిన తండ్రికి నివాళిగా అసెంబ్లీలో అడుగుపెట్టాలనుకుంటున్న కొడుకులు కూడా ఉన్నారు. ప్రస్తుతం అన్ని పార్టీల్లోనూ ఈ తాపత్రయం పెరిగిపోగా?. అధికార పార్టీలో కాస్త మోతాదు ఎక్కువగా ఉంది. మాజీ మంత్రి దేవినేని నెహ్రూ కుమారుడు అవినాష్ తండ్రి బతికున్న సమయంలోనే కాంగ్రెస్ తరపున ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. నెహ్రూ చనిపోయాక గుడివాడ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కూడా ఓడిపోయారు అవినాష్. ముచ్చటగా మూడోసారి తన అదృష్టాన్ని వైసీపీ తరపున విజయవాడ తూర్పు నియోజకవర్గంలో పరీక్షించుకునే ప్రయత్నంలో ఉన్నారాయన. ఈసారి ఎలాగైనా గెలిచి తన తండ్రికి నివాళిగా ఇవ్వాలన్నది ఆయన పట్టుదల అట. పెడన నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన టీడీపీ సీనియర్ లీడర్ కాగిత వెంకట్రావు కుమారుడు కాగిత కృష్ణప్రసాద్ తండ్రి మరణంతో గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు.

# ఏపీలో చిన్నమ్మ మార్క్ పాలిటిక్స్

విజయవాడ, ఆగస్టు 10, ఏపీ బీజేపీ రథసారథి దగ్గుబాటి పురంధేశ్వరి రాజకీయాలపై ఫోకస్ పెట్టారా? అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన పురంధేశ్వరి పార్టీపై తన ముద్ర వేసుకునేందుకు వ్యూహరచన చేస్తున్నారా? ఇప్పటి వరకు ఆయా ప్రాంతాల్లో పర్యటించి కార్యకర్తల్లో ఉత్సాహం నింపిన పురంధేశ్వరి ఇక ప్రత్యక్ష పోరుకు సై అంటున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తుంది. రాజకీయాల్లో దగ్గుబాటి పురంధేశ్వరికి ప్రత్యేక గుర్తింపు ఉంది. గతంలో కేంద్రమంత్రిగా ఆమె మార్కు రాజకీయం చేశారు. రాజకీయాల్లో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న పురంధేశ్వరి అనర్గళంగా మాట్లాడటంలో దిట్ట. అంతేకాదు అన్ని అంశాలపై పూర్తి అవగాహన కలిగిన పురంధేశ్వరి అవే ఆయుధాలతో ఇక వైసీపీ ప్రభుత్వంపై అమితుమీకి సై అంటున్నారు. ఇప్పటికే ఏపీ అప్పులపై నిలదీస్తూ వైసీపీ ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న దగ్గుబాటి పురంధేశ్వరి ఇక వ్యవస్థలకు అండగా పోరాటం చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా తొలుత పంచాయతీ సర్పంచ్‌లతో కలిసి వైసీపీ ప్రభుత్వంపై పోరుబాటకు శ్రీకారం చుట్టారు. పంచాయతీ వ్యవస్థలను బలోపేతం చేసేందుకు.. గ్రామ పంచాయితీల నిధులను స్వాహా చేస్తున్న రాష్ట్రప్రభుత్వాన్ని నిలదీయడానికి పురంధేశ్వరి రెడీ అవుతున్నారు. ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి ఇక ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా సర్పంచ్‌లు చేస్తున్న ఆందోళన తెలిపారు. సర్పంచ్‌లు చేపట్టబోయే కార్యక్రమంలో పాల్గొని ప్రజల్లోకి వెళ్లేలా స్కెచ్ వేశారు. పంచాయితీల నిధులను స్వాహాచేస్తే గ్రామాలు ఎలా అభివృద్ధి చెందుతాయని బీజేపీ వాదిస్తుంది. ఇదే అంశంపై దగ్గుబాటి పురందేశ్వరి రాష్ట్ర స్థాయిలో నాలుగు జోన్ లలో నిర్వహించిన బీజేపీ జోనల్ సమావేశాల్లో రాష్ట్రప్రభుత్వ వైఖరి పై పోరుబాట పట్టాలని పిలుపునిచ్చారు. గాంధీమహాత్ముడు కలలుకన్న గ్రామస్వరాజ్యం రావాలని కేంద్రం నేరుగా గ్రామ పంచాయితీలకు నిధులు విడుదల చేస్తే రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులకు మోకాలొడ్డుతోంది అని పురంధేశ్వరి ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి వల్ల గ్రామ పంచాయితీల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేని పరిస్థితిలు ఏర్పడుతున్నాయని మండిపడ్డారు. సర్పంచ్‌ల హక్కుల సాధన కై పోరుబాట పడుతున్నామని దగ్గుబాటి పురంధేశ్వరి ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టరేట్‌ల వద్ద ఆందోళన కార్యక్రమాలకు పురంధేశ్వరి పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించేందుకు కసరత్తు సైతం మె?దలు పెట్టినట్లు తెలుస్తోంది.

## రైతులకు స్ప్రింక్లర్ పరికరాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి.



ఎమ్మిగనూరు ఆగష్టు 10 విభారె న్యూస్.గురువారం ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిసాగు పథకం కింద ఎమ్మిగనూరు నియోజకవర్గంలో రైతులకు డిప్/స్ప్రింక్లర్ పరికరలను ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ప్రింక్లర్లు అనేవి పంటలకు సాగునీటిని అందించేందుకు లేదా వినోదం కోసం,ఒక శీతలీకరణ వ్యవస్థ గా, లేదా ధూళి నియంత్రణకు నీరును చిమ్మే సాధనాలు. స్ప్రింక్లర్ ఇరిగేషన్ అనేది వర్షపాతాన్ని పోలిన విధంగా నియంత్రిత రీతిలో నీటిని అప్లై చేసే విధానం. పంపులు, వాల్వ్ లు, పైపులు , స్ప్రింక్లర్ లు ఉండే నెట్ వర్క్ ద్వారా నీరు పంపిణీ చేయబడుతుంది.నీటి పారుదల స్ప్రింక్లర్లను నివాస, పారిశ్రామిక,వ్యవసాయ వినియోగానికి ఉపయోగించవచ్చు. తగినంత నీరు అందుబాటులో లేని అసమాన భూమిలో అదేవిధంగా ఇసుక మట్టిపై ఇది ఉపయోగకరంగా ఉంటుంది. పైన తిరిగే నాజిల్స్ ఉన్న లంబపైపులు,రెగ్యులర్ విరామాల్లో ప్రధాన పైప్ లైన్ కు జతచేయబడతాయి. ప్రధాన పైపు ద్వారా నీటిని ఒత్తిడి చేసినప్పుడు అది తిరిగే నాజిల్స్ నుండి రావడం జరిగి, పంటపై చల్లబడుతుంది.స్ప్రింక్లర్ లేదా ఓవర్ హెడ్ ఇరిగేషన్ లో,పొలంలో మరో కేంద్ర ప్రదేశాలకు నీటిని పైప్ చేయబడుతుంది,ఓవర్ హెడ్ హై ప్రజర్ స్ప్రింక్లర్ లు లేదా గన్ ల ద్వారా పంపిణీ చేయబడుతుంది.కార్యక్రమంలో సంబంధించిన అధికారులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు బాలింతలకు పిల్లలకు పౌష్టికాహారాన్ని ఆకస్మిక తనిఖీ ఎంపీడీఓ శ్రీనివాసరావు



పెద్దకడబూరు ఆగష్టు10 :n ( విభారె న్యూస్)పెద్దకడుబూరు మండల పరిధిలోని జాలవాడి గ్రామంలోని అంగన్వాడి కేంద్రాలను ఎంపీడీఓ శ్రీనివాసరావు అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీలలో పిల్లలు, గర్భిణులు, బాలింతల హాజరు,పట్టిక రికార్డులను పరిశీలించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పెట్టే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాలు సకాలంలో తెరవాలని, కార్యకర్తలు, ఆయాలు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు.

## ఎంపీపీ పాఠశాల అకస్మిక తనిఖీ చేసిన ఎంపీడీఓ శ్రీనివాసరావు



పెద్దకడబూరు ఆగష్టు10 : ( విభారె న్యూస్)పెద్దకడబూరు మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ శ్రీనివాసరావు గురువారం అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. తాగునీటి కొళాయిలను పరిశీలించారు. విద్యార్థుల డిజిటల్ క్లాస్ ను తిలకించారు. విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. బడి భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని, నాణ్యమైన భోజనం పెట్టాలని సూచించారు

## పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు

**రవి చంద్రా రెడ్డి మున్సిపల్ కమిషనర్**



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 10 . విభారె న్యూస్ : స్థానిక పట్టణంలో గురువారం నాడు నంద్యాల మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి హెల్త్ ఆఫీసర్ అంకిరెడ్డి. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి తో కలసి సంజీవనగర్ గేటు వద్ద వర్షం నీరు రోడ్లపై ప్రవహిస్తోందని గమనించి. పారిశుధ్య కార్మికులతో కాలువలను శుభ్రం చేయించి వర్షం నీరు పోవడానికి తగు సూచనలు చేశారు . ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ ఏర్పాట్లపై ఎక్కడ ఆలసత్వం ప్రదర్శించ వద్దని సూచించారు.. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ అంకిరెడ్డి. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ.

# ప్రాథమిక విద్యావ్యవస్థను కాపాడుకుందాం

**- ఆవిర్భావ దినోత్సవంలో యుటిఎఫ్ పిలుపు.**
**- యుటిఎఫ్ 50వ ఆవిర్భావదినోత్సవం సందర్భంగా యుటిఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న సీనియర్ నాయకులు భాస్కర్ బాబు.**



ఎమ్మిగనూరు ఆగష్టు 10 విభారె న్యూస్.జాతీయ విద్యావిధానం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం70సంవత్సరాలు గా గ్రామీణప్రాంతాలలో విద్యను అందిస్తున్న ప్రాథమిక పాఠశాలలను కనుమరుగు చేసి బడుగు బలహీన వర్గాల పిల్లలను చదువుకు దూరం చేసే ప్రయత్నం చేస్తుందని ప్రాథమిక పాఠశాలలను యధావిధిగా కోనసాగించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి యన్.నాగమణి, జిల్లా అధ్యక్షుడు జె.ఎల్లప్ప పిలుపునిచ్చారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 49సంవత్సరాలు పూర్తిచేసుకోని 50వ సంవత్సరంలోకి అడుపెట్టిన సందర్భంగా స్థానిక ప్రాంతీయకార్యాలయం లో యుటిఎఫ్ జెండాను సీనియర్ నాయకులు భాస్కర్ బాబు ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాగమణి, ఎల్లప్ప, భాస్కర్ బాబు,దావీదు మాట్లాడారు. చెన్నుపాటి లక్ష్మయ్య గారి ఆశయాలతో అప్పారి వెంకటస్వామి, మైనేని వెంకటరత్నం, దాచూరి రామిరెడ్డి గారి నాయకత్వంలో 1974ఆగస్టు10న రాష్ట్ర వ్యాప్త సంఘంగా యుటిఎఫ్ ఆవిర్భవించింది ఆనాటి నుండి నేటివరకు ఉపాధ్యాయ,విద్యారంగసమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేస్తూ ఎన్నో విజయాలు సాధించింది అని అన్నారు ముఖ్యంగా ఉపాధ్యాయులకు రీ గ్రూపింగ్ స్కేలు,అప్రెంటీస్ విధానానికి రెండునోషనల్ ఇంక్రిమెంట్స్,అప్రెంటీస్ విధానం రద్దు,కౌన్సెలింగ్ విధానాన్ని సాధించడంలో యుటిఎఫ్ చేసిన పోరాటాల వల్లే సాధ్యమయ్యాయి అని పేర్కొన్నారు. ప్రస్తుతం విపిస్ విధానం రద్దు,ఏం ట్ట్-2020రద్దు కోరకు యుటిఎఫ్ నిరంతరం పోరాడుతూనే ఉందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు దేవపాల్, నరసింహులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యం.నాగరాజు వివిధ మండలాల నాయకులు యం.హనుమంతు, భీమేష్,రాఘవేంద్ర,శాంతిరాజు, జ్ఞానప్రకాష్ ,తాతయ్య, యం.రాజు,చంద్రపాల్,బాబు,యన్.నాగరాజు,వీరభద్రయ్య ఉశేనీ,సుధాకర్, లింగమూర్తి, శివకుమార్, రవికుమార్, ప్రకాష్,లతీఫ్ తదితరులు పాల్గొన్నారు

# ఏపీఐఐసీ కింద భూములు కోల్పోయిన రైతులకు పూర్తి నష్టపరిహారం ఇవ్వాలి

**ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ డిమాండ్.**



ఓర్వకల్, ఆగష్టు 10 విభారె న్యూస్ :ఓర్వకల్లు మండలం కొమరోలు గ్రామంలో దళిత పేదలకు 1998 వ సంవత్సరంలో ఆనాటి ప్రభుత్వం భూమిలేని నిరుపేదలను గుర్తించి పట్టాలు ప్రదానం చేసింది అప్పటినుండి నేటి వరకు ఆ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు ఆయన తెలిపారు ప్రస్తుతం ఓర్వకల్లు మండలంలో పరిశ్రమల ఏర్పాటు కోసం భూములు సేకరణ చేస్తున్నారు అందులో భాగంగా కొమరోలు గ్రామంలో అన్ని పేద దళితులైన లక్ష్మీదేవి అయ్యమ్మ రాజు మరొక ఎనిమిది మంది భూములను ప్రభుత్వం తీసుకున్నది అయితే వారికి పూర్తి నష్టపరిహారం చెల్లించలేదు నష్టపరిహారం ఇవ్వాలని గత ఐదు సంవత్సరముల నుండి కాళ్ల అడిగేటట్లు తిరిగినప్పటికీ అధికారులలో స్పందన రావడం లేదు మూడు ఎకరాలు ఐదు ఎకరంలు పట్టా ఉన్నప్పటికీ కేవలం ఒక ఎకరా కొందరికి మరికొందరికి 80 సెంట్లుకుమాత్రమే నష్టపరిహారం చెల్లించారు ఇది చాలా అన్యాయమని రామకృష్ణ తెలిపారు ఎన్నో సంవత్సరాలుగా కంప చెట్లు రాళ్లు తొలగించి భూమిని సాగు చేయగా అటువంటి భూమికి నష్టపరిహారం పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడం సమంజసం కాదని వెంటనే పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని లేని పక్షంలో వారి భూములు వారికి ఆన్లైన్లో ఉండేటట్లు కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు ఈరోజు జిల్లా రెవెన్యూ కార్యాలయంలో ఏవో వెంకటేశ్వర్లు గారికి విజ్ఞాపన అందజేశారు ఏవో వెంకటేశ్వర్లు స్పందిస్తూ తప్పనిసరిగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# తెదేపా నియోజకవర్గస్థాయి సమావేశం.





ఎమ్మిగనూరు టౌన్ ఆగస్టు 10 విభారె న్యూస్:-తెలుగుదేశం పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశం గురువారం స్థానిక కొన్ని కళ్యాణమండపం నందు జరిగింది. ఈ కార్యక్రమానికి తెదేపా జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ బీటీ నాయుడు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, . నియోజకవర్గ పరిశీలకులు శ్రీరాములు హాజరయ్యారు. ముందుగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు కీ.శే.ఎన్టీ రామారావు, మాజీ మంత్రి .కీ.శే. బివి మోహన్ రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజల్లో అసంతృప్తి నెలకొందన్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీకి జనాబలం పెరిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త ఒక సైనికుని లా పనిచేసి పార్టీని అత్యధిక మెజార్టీలో గెలిపించుకోవాలని కోరారు. అనంతరం తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ జయ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ యాత్రలకుప్రజల్లో అనూహ్యస్పందన వస్తోందని వైసీపీ నాయకుల్లో భయాందోళనలు మొదలయ్యాయని, అందుకే దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జయభేరి మోగిస్తుందని, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు పదవి చేపడతారని జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళా, తెలుగు యువత సభ్యులు, టీఎన్ఎస్ఎఫ్, ఐ టి డి పి సభ్యులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల వారు ప్రభుత్వ పాఠశాలకు నిత్యావసర సామాగ్రి పంపిణీ

**రోటరీ క్లబ్ నంద్యాల అధ్యక్షులు దండే దస్తగిరి**



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 10 విభారె న్యూస్ :-నంద్యాల మండలం బిల్లాలాపురం గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు నిత్యావసర సామగ్రిని అయిన స్టీల్ ప్లేట్లు, వాటర్ క్యాన్లు రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు రాధిక, మధుసూదన్ దంపతుల సహాయ సహకారాలతో అందజేయడం జరిగిందని రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల అధ్యక్షుడు దండే దస్తగిరి తెలిపారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ నంద్యాల అధ్యక్షులు దండే దస్తగిరి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా విద్య, వైద్యానికి సంబంధించిన సహాయక సహకారాలు ఎల్లప్పుడూ అందజేస్తామని తెలిపారు. క్లబ్ సభ్యులు రాధిక, మధుసుధన్ లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వారికి అవసరమైన సామాగ్రినీ అందజేయడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు.

## బిసి , ఎస్ సి సంక్షేమ హాస్టల్స్ సమస్యలు పరిష్కరించాలి. ఎస్ ఎఫ్ ఐ

**సంక్షేమ హాస్టల్స్ లో ఉన్న విద్యార్థులు అనారోగ్యాలతో ఇబ్బంది పడుతున్నారు**



కర్నూలు, ఆగష్టు 10 విభారె న్యూస్ :భారత విద్యార్థి ఫెడరేషన్ ( ఎస్ ఎఫ్ ఐ ) ఆధ్వర్యంలో సంక్షేమ శాఖ సూపర్డెంట్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ కర్నూల్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు అమర్ , సాయి ఉదయ్ మాట్లాడుతూ చదువుకోవాలంటే విద్యార్థులు సరైన సౌకర్యాలు ఉండాలి కానీ కర్నూల్ నగరంలో ఉన్నటువంటి బిసి , ఎస్ సి సంక్షేమ హాస్టల్స్ లో సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బీసీ హాస్టల్లో గదులు సరిగ్గా లేవు రేకులు ఉండడంవల్ల వర్షపు నీరు గదుల్లోకి వస్తుంది . నీళ్లు రూముల్లోకి రావడం వల్ల చదువుకోవడానికి చాలా ఇబ్బందిగా ఉంది. అలాగే పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నారు. ఆరోగ్యం బాగోలేక విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. సంక్షేమ హాస్టల్స్ లో ప్రాథమిక వైద్యులను నియమించాలని కోరుతున్నాము. ఎస్సీ హాస్టల్లో రెండు ఓకే బిల్డింగ్ లో ఉంచడం ద్వారా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల భోజనం అందరికీ అందడం లేదు. అలాగే తాగునీరు కూడా బాగా ఉండడం లేదు. ఇప్పటికైనా బీసీ ఎస్సీ సంక్షేమ అధికారులు ఈ హాస్టలపై దృష్టి సాధించి సమస్యలు పరిష్కరించాలి. సమస్యలను పరిష్కరించి విద్యార్థుల చదువుకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కార్యకర్త పవన్ , కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ



ఎమ్మిగనూరు టౌన్ ఆగస్టు 10 విభారె న్యూస్:-పట్టణంలోని ఇందిరానగర్ నందు గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం నులి పురుగు నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ జరిగింది. మాత్రల పంపిణీ కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి చేతుల మీదుగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతులు పరిశుభ్రంగా లేనప్పుడు తిన్న ఆహారం ద్వారా నులి పురుగులుశరీరంలోకి ప్రవేశిస్తాయని, అందుకే భోజనం తినే ముందు చేతులను పరిశుభ్రంగా కడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారులు ,ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలోకర్నూలు జిల్లా గ్రామసర్పంచ్ లమహాధర్నా విజయవంతం

కర్నూలు ప్రతినిధి ఆగస్టు 10 విభారే న్యూస్గురువారంకర్నూలు లో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ధర్నాచౌక్ దగ్గర నుండి కలెక్టర్ ఆఫీస్ ముట్టడి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర రథసారథి శ్రీమతిపురందేశ్వరి పిలుపు మేరకు సర్పంచుల సమస్యల గురించి భారతీయ జనతా పార్టీ మహాధర్నా కర్నూలు జిల్లా అధ్యక్షులు పోల్లంకి రామస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాలను అభివృద్ధి చేసే సర్పంచుల నిధులే దారి మళ్లించే దౌర్భాగ్యమైన పరిపాలన ఉందని జగన్ పరిపాలన ఇంత ఘోరంగా ఉందని విమర్శించారు ఈకార్యక్రమంలో శ్రీ కపిలేశ్వరయ్య శ్రీ టీజీ వెంకటేష్ రాఘవేంద్ర హరీష్ బాబు కర్నూలు జిల్లా ఇన్చార్జి అంకల్ రెడ్డి కర్నూల్ అసెంబ్లీ కన్వీనర్ రంగస్వామి వేల్పులగోపాల్ జిల్లా ప్రధానకార్యదర్శిలు నరసింహవర్మ కాశీవిశ్వనాథ్ మద్దిలేటియాదవ్ మీడియా కన్వీనర్ రాఘవేంద్ర వివిధ మోర్చాల అధ్యక్షులు జి మాలతి గీతామాధురి మస్తాన్ బి టీశ్రీనివాసులు హవీలేన్ బాబు శ్రీనివాసులు ఉల్చాలలక్ష్మణ్ నాయుడు మురళినాయుడు పరశురామ్ మోహన్ రెడ్డి శివరామ్ సుధాకర్ అయ్యస్వామి సూర్యకుమార్ తిమ్మరాజు భాస్కర్ మాధవ్ కర్నూల్ పార్లమెంట్ లో ఉన్నటువంటి గ్రామ సర్పంచులు అసెంబ్లీ కన్వీనర్లు వెంకటరాముడు మురహరిరెడ్డి పురుషోత్తంరెడ్డి మండలాల అధ్యక్షులు బిఈరన్న మల్లేష్ నాయుడు సురేంద్ర ఏసురాజు మధు అశోక్ బుపనమధు మహేంద్ర బాలచందర్ ఉసేన్ శివనాయుడు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190